క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు

కవిటి: ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న ఏపీ మోడల్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని రాజపురం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యు.ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లుగా కరోనా కారణంగా లాటరీ విధానంలో ప్రవేశాలు నిర్వహించగా, ప్రస్తుతం మరలా యథావిధిగా ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణ ద్వారానే ఎంపికలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్షా సమయాని కన్నా గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

'జగనన్నకు చెబుదాం'పై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి లోకనాథం

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం శుక్రవారం సమీక్ష చేపట్టారు. వచ్చిన వినతులు, పరిష్కారంపై ఆరా తీశారు. ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.రాజేశ్వరమ్మ, సీనియర్ అసిస్టెంట్ వెంకటరావు, మండల ఇంజినీర్ లతాశ్రీ పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

సంతబొమ్మాళి: మండలంలోని మేఘవరం గ్రామానికి చెందిన సదాశివుని భారతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సర్పంచ్ పరపటి సునీత రెడ్డి చేతులు మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సూరాడ రాజారావు, మరువాడ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు సురాడ జోగారావు, ఉప సర్పంచ్ మంకు సింహాచలం, గంట ఈశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ కోరాడ విద్య, వెల్ఫేర్ అసిస్టెంట్ అంగూరు మధుసూదనరావు, వలంటీర్ పైల కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న మేనేజర్ లక్ష్మీనారాయణ

కోటబొమ్మాళి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న కొత్తకోట గోపాకృష్ణకు చెందిన ప్రైవేటు స్టేట్ బ్యాంకు బీసీ పాయింట్‌ను స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ ఎన్.లక్ష్మీనారాయణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాయింట్‌లో డబ్బులు విత్‌డ్రా చేసినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా రూ.1000లకు రూ.10లు చొప్పున్న వినియోగదారుల నుంచి కమీషన్ వసూలు చేస్తున్నారని, కమీషన్ ఇవ్వకపోతే డబ్బులు విత్‌డ్రా చేయడం లేదని చీపుర్లపాడుకు చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి వాన సిమ్మయ్య ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేపట్టారు. విచారణపై నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలియజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ భాస్కరరావు

వజ్రపుకొత్తూరు: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని పల్లివూరు సర్పంచ్ మామిడి భాస్కరరావు అన్నారు. పంచాయతీ పరిధి దుక్కవానిపేటలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎం.పాపారావు, పెద్దలు ఎం.బేదవరావు, దుక్క సాంబమూర్తి పాల్గొన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'



బాతుపురంలో అవగాహన కల్పిస్తున్న సీఐ దేవుళ్లు

వజ్రపుకొత్తూరు రూరల్: సముద్ర మార్గం ద్వారా తీరంలోకి అక్రమంగా చొరబడే అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని బావనపాడు మైరెన్ సీఐ దేవుళ్లు సూచించారు. మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో శుక్రవారం పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన సముద్ర తీరం కలిగిన ఈ ప్రాంతంలో చొరబాటుదారులు ప్రవేశించేందుకు అవకాశం ఉందన్నారు. సముద్ర తీరంతో పాటు గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

కవిటి వ్యవసాయాధికారిగా రూప



కవిటి: మండల వ్యవసాయశాఖ నూతన అధికారిగా డి.రూప వచ్చారు. ఆమె ఇదివరకు పాడేరు ఏవోగా విధులు నిర్వహించారు. మండలంలో వ్యవసాయశాఖ పరిధిలో ఉన్న ఆర్బీకేల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

గడప గడపలో సంతోషాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- తాళభద్రలో గడప గడపకూ మనప్రభుత్వం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

సోంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని తాళభద్ర సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేశారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉగ్రపల్లి తిరుపతిరావు, ఉగ్రపల్లి కృష్ణారావు, పుక్కళ్ల కూర్మారావు, బీన ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

రైతు సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బారువ రైతు భరోసా కేంద్రంలో యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతు గ్రూపులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి ట్రాక్టర్లు పంపిణీ చేశారు. అనంతరం రాయితీపై విత్తనాలు అందజేశారు. అ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్బీకేల ద్వారా రైతులకు గ్రామాల్లోనే అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయని తెలియజేశారు. ప్రతీ రైతు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, సర్పంచ్ యర్ర రజనీ, పార్టీ నాయకులు భువనేశ్వర్ పాణిగ్రాహి, కర్రి సత్యం, అమర లోకనాథం, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, ఈవోపీఆర్డీ టి.వాసుదేవు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు సిద్ధం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీదేవి

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వం రైతులకు రాయితీపై అందజేస్తున్న వరి, పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 40 శాతం రాయితీపై 82 వేల ఎకరాలకు అవసరమైన 1,004 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దక్కత నూకయ్యరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, దుక్క ఆనంద్, రాంపత్ని చట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

11న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకుగాను దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు ఒక గంట ముందుగా హాజరవ్వాలని సూచించారు.

రేపటి నుంచి గ్రామ దేవత ఉత్సవాలు



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో చీపురపల్లి పంచాయతీ పరిధిలోని ఎం.గడూరులో వెలసిన సందక్కమ్మ గ్రామ దేవత ఉత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలియజేశారు. ఐక్యమత్యానికి ప్రతీకగా నిలుస్తున్న గ్రామ దేవత ఉత్సవాలను 9 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో భక్తి భావం మరింత పెంపొందించేందుకు ఉత్సవాలు దోహదం చేస్తాయని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు దాసరి పాపారావు, సాతుపల్లి శేషయ్య, కర్రి తిరుపతి, ఎస్.కామేశ్వరరావు, అంబటి జోగారావు పాల్గొన్నారు.

'బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి'



వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు

టెక్కలి: డివిజన్ పరిధిలోని ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులకు ఖచ్చితంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలని టెక్కలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. ఈనెల 15లోగా ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన యాజమానాలు స్వచ్ఛందంగా బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకొని, సర్టిఫికెట్ పొందాలని సూచించారు. డివిజన్ పరిధిలో వివిధ ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన 113 బస్సులు ఉన్నాయని, వాటిలో ఇప్పటికే 77 బస్సులకు వరకు ఫిట్‌నెస్ చేయించుకున్నారని తెలిపారు. ఈ విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే ఆయా యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనులు



కాశీబుగ్గ: శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి హరిప్రసాద్

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చీపురపల్లి పంచాయతీ పరిధి ఎం.గడూరులో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 12వ వార్డు పల్లివీధిలో శుక్రవారం పారిశుద్ధ్య పనుల స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ నాగేంద్రకుమార్‌ల ఆదేశాలతో శానిటేషన్ సిబ్బంది మురుగు, చెత్తను తొలగించారు. పల్లివీధి, హరిజనవీధి, పోలీసుస్టేషన్ రోడ్డు, జగన్నాథసాగర రోడ్డు తదితర వీధుల్లో పనులు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పోతనపల్లి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీరగున్నమ్మపురంలో గ్రామదేవత ఉత్సవాలు

మందస: మండలంలోని వీరగున్నమ్మపురంలో గ్రామదేవత పాలపోలమ్మతల్లి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 13వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని, సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

రుణాలు అందజేత



రుణాలు అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస పీఏసీఎస్ కార్యాలయం నందు ఎస్టీ, ఇతర స్కీమ్‌లలో మంజూరైన రుణాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. శాప మన్మథరావుకు రూ.5 లక్షలు, జడ్డే పాపారావుకు రూ.3 లక్షలు, మల్లా నాగభూషణరావుకు రూ.5లు, సవర సురంగికి రూ.5 లక్షల రుణాలను పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు(చిట్టిబాబు) చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సీఈవో శ్రీనివాసరావు, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ డి.కృష్ణారావు, సూపర్‌వైజర్ ఎర్రయ్య, బొడ్డపాడు ఎంపీటీసీ మద్దిల పాపారావు, కేదారిపురం సర్పంచ్ ధనుంజయ్, బొడ్డపాడు ఉప సర్పంచ్ మురళి, లంబాడ మోహన్ రావు, పీఏసీఎస్ ఆఫీస్ సిబ్బంది శ్రీనివాస్‌రావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లాడిని కొడుతుంటే చూడలేక..

కాశీబుగ్గ: తాగిన మత్తులో కన్న కొడుకును తల్లిదండ్రులు చావబాదుతుంటే స్థానికులు కాపాడిన సంఘటన కాశీబుగ్గలో శుక్రవారం జరిగింది. ప్లాస్టిక్ సామాన్లు ఏరుకుని బతికే ఓ కుటుంబం కాశీబుగ్గ డిగ్రీ కాలేజీ రోడ్డులో చిన్న దుకాణం వద్ద బస చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భార్యాభర్తలు తాగిన మత్తులో వరండాలో కుమారుడిని పడేసి చితకబాదారు. స్థానికులు చూసి ప్రశ్నిస్తే వారిపైనా దాడికి తెగబడ్డారు. దీంతో బద్రి సీతమ్మ అనే స్థానిక మహిళ స్థానికుల సాయంతో చిన్నారికి కాపాడారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం కోసంగిపురం కూడలి వద్ద ఉన్న అనాథ శరణాలయానికి తీసుకుని వెళ్లి ఆశ్రమ అధిపతి చిన్నికృష్ణకు అప్పగించారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు



జెడ్పీటీసీకి ప్రతిపాదనలు అందజేస్తున్న హౌసింగ్ అధికారులు

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీ వైఎస్సార్, జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు, లింకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు హౌసింగ్ డీఈ రామచంద్ర తెలియజేశారు. శుక్రవారం పలాసపురం జెడ్పీటీసీ తడక యశోదను కలిసి జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. త్వరలో పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్, టి.ఈ.రవిచంద్ర తదితరులు ఉన్నారు.

'రుణాలను సద్వినియోగం చేసుకోవాలి'

కాశీబుగ్గ: యూనియన్ బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా స్థిరపడాలని యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్, ఎంఎల్‌పీ వి.సత్యనారాయణ సూచించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశీబుగ్గ యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో ఖాతాదారులతో రుణాలకు సంబంధించిన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. బ్యాంకు ఇచ్చిన రుణాలను తీసుకుని, వ్యాపారాలు సాగించి తిరిగి చెల్లింపులు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాశీబుగ్గ బ్రాంచ్ మేనేజర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు పంపిణీ



రైతులకు ఎరువులు అందజేస్తున్న సర్పంచ్ మోహన్‌రెడ్డి

టెక్కలి: మండలంలోని బొప్పాయిపురం, అక్కవరం పంచాయతీల పరిధిలోని రైతు భరోసా కేంద్రం వద్ద పలువురు రైతులకు శుక్రవారం ఎరువులు పంపిణీ చేశారు. సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి నేతృత్వంలో రైతులకు యూరియా, డీఏపీ బస్తాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి.అప్పలనాయుడు, వ్యవసాయ సహాయకుడు సుమంత్, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్రికా పఠనంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పత్రికా పఠనంపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థి స్థాయి నుంచి దినపత్రిక చదవడం వలన కలిగే లాభాల గురించి గ్రంథాలయాధికారి ఎస్.రామారావు ఆధ్వర్యంలో వివరించారు.

ఖరీఫ్‌కు సమగ్ర కార్యాచరణ



మాట్లాడుతున్న కడియాల ప్రకాష్

కవిటి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతకు అన్నివిధాలుగా మెరుగైన, వేగవంతమైన సేవలందించడమే లక్ష్యంగా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, మండల వ్యవసాయ సలహా మండలి కన్వీనర్ దువ్వు కృష్ణారెడ్డిలు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వ్యవసాయ, ఉద్యానశాఖలపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను హెచ్‌వో పోలాకి మాధవీలత, ఏవో డి.రూప తెలియజేశారు. పచిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడం, వరి విత్తనాలు సకాలంలో అందించడం మనముందున్న తక్షణ కర్తవ్యమని నేతలు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా లైన్‌మెన్ ఆరోగ్యం

కోటబొమ్మాళి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జర్జంగి ఫిడర్‌కు అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న కర్రి శాంతారావు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ఏఈ బి.వెంకటసురేష్ శుక్రవారం తెలియజేశారు. బుధవారం రాత్రి గాలివాన కారణంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌పై విరిగిపడిన వృక్షాన్ని తొలగించే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడిన శాంతారావును విశాఖపట్నంలోని 7హిల్స్ ఆస్పత్రిలో చేర్చారు. మెదడులోని నరాలు చిట్లిపోయినందున వైద్యులు ఆపరేషన్ చేసి ఐసీయూలో ఉంచినట్లు ఏఈ పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి తదితరులు

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి
- మలగాంలో గడప గడపకూ మన ప్రభుత్వం

సంతబొమ్మాళి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని మలగాం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తూ ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనునిత్యం కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేరుగు రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సురాడ వెంకటేష్, కొండయ్య, సవరయ్య, ఎం.రవణమూర్తి, పి.మేనకేతనరెడ్డి, ఎం.అప్పారావు, ఎన్.భీమారావు, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సంత స్థలానికి రక్షణ కల్పించండి'



తహసీల్దార్ హైమావతికి సమస్యను విన్నవిస్తున్న అంపురం పంచాయతీ ప్రజలు

కంచిలి: మండలంలోని అంపురం పంచాయతీ పరిధి నరసన్నముకుందాపురం గ్రామ రెవెన్యూలో వివిధ గ్రామాల రైతులంతా కలిసి విరాళంగా ఇచ్చిన స్థలంలో 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న రోజువారీ మార్కెట్ సంత స్థలానికి రక్షణ కల్పించాలని స్థానిక సర్పంచ్ మద్ది మోహిని తదితరులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎస్.హైమావతిని శుక్రవారం కలిసి విన్నవించారు. సంత స్థలానికి సంబంధించి కొందరి పేరున అప్పట్లో వివిధ గ్రామాల రైతులంతా కలిసి రిజిస్ట్రేషన్ చేయించామని, అయితే రిజిస్ట్రేషన్ పొందినవారిలో కొందరి వారసులు ఇప్పుడు ఆ స్థలం వారిదేనని మ్యుటేషన్‌కు దరఖాస్తు చేయడం వంటి చర్యలకు పాల్పడడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో పునః నమోదును సంత పేరున చేపట్టాల్సిందిగా కోరారు. 1985లో ఈ స్థలం సంతకే చెందుతుందని హైకోర్టులో సైతం జడ్జిమెంట్ రావడం జరిగిందని గుర్తు చేశారు. ఈ స్థలం విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంపురం పంచాయతీకి వచ్చిన నోటీసులపై పంచాయతీ తీర్మానం ఇస్తూ సమాధానం ఇచ్చినట్లు వెల్లడించారు. తహసీల్దార్‌ను కలిసినవారిలో మద్ది అప్పారావు, ఉపసర్పంచ్ లింగం కేశవరావు, మునకాల వీరాస్వామి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు ఉపాధి పనులు కల్పించాలని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు కె.బాలాజీ, ప్రజా సంఘాల నాయకులు ఆర్.నీలాచలం, ఎస్.హేమసూదన్‌లు కోరారు. ఈ మేరకు గ్రామ సచివాలయంలో అధికారులకు వినతిపత్రం శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దాదాపుగా 300 ఉపాధి కూలీలు ఉన్నప్పటికీ, పనులు కల్పించకపోవడంతో వలస బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 6 నెలలుగా ఉపాధి పనులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కె.మాధవరావు, శంకరరావు, మల్లయ్య, నరేష్‌తో ఉన్నారు.

నాడు–నేడు పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డాక్టర్ మేఘన

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో జరుగుతున్నటువంటి నాడు-నేడు పనులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగ్గున మేఘన శుక్రవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పనులకు రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలియజేశారు. ప్రస్తుతం ఆస్పత్రి తీరుతెన్నులు మారుతున్నాయని, రెండు అంతస్తులు ఉన్న భవనం, నాలుగు అంతస్తులుగా మారుతుందని పేర్కొన్నారు. ఆమెతో పాటు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి గురుకుల (బాలుర) పాఠశాలలో గురుకుల ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. పాఠశాలలో 6వ తరగతి, 7వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లులో చేరేందుకు అర్హత కలిగిన 54 మంది విద్యార్థులు పరీక్ష కేంద్రంలో ప్రవేశ పరీక్ష రాశారు. పరీక్షలను స్థానిక ప్రిన్సిపాల్ ఎం.పాపారావు పర్యవేక్షించారు.

సత్తాచాటిన విద్యార్థులు



జుట్టు ప్రవళ్లిక (93వ ర్యాంకు)



కర్రి జోత్స్న (94వ ర్యాంకు)

టెక్కలి: ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. బైపీసీ విభాగంలో జుట్టు ప్రవళ్లిక రాష్ట్రస్థాయిలో 93వ ర్యాంకు, కర్రి జోత్స్న 94వ ర్యాంకు, పొల్లూరు యశస్విని 216వ ర్యాంకు, మునికోటి పవన్‌కుమార్ 350వ ర్యాంకు, పుచ్చ తనీషా 963వ ర్యాంకు, దీర్గాసి అంజలి 1,040వ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. అలాగే ఎంపీసీ విభాగంలో కొప్పల స్వాతి 496 ర్యాంకు, సత్తారు భార్గవ్ 649 ర్యాంకు, లక్కోజు వైష్ణవి 1,918 ర్యాంకు, గొల్లవలస ప్రవీణ్ 2,111 ర్యాంకు సాధించారు.



ఏపీఆర్ఎస్‌కు ఎంపికైన ఇన్నేశుపేట విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఇన్నేశుపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఏపీఆర్ఎస్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని హెచ్ఎం బి.శంకరం తెలియజేశారు. పరీక్షలో రాష్ట్రస్థాయిలో 4వ తరగతి చదువుతున్న ఇసురు సూర్యసాయి 92 మార్కులు, ఇసురు కుషాల్ 86 మార్కులు, గువ్వాడ గౌతమ్ 66 మార్కులు సాధించి ఎస్.ఎం.పురం స్కూల్‌కు, ఆశి లక్ష్మీ 83 మార్కులు, ఆశి భావని 80 మార్కులు సాధించి ఏపీఆర్ఎస్ వమ్మరవల్లి పాఠశాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఒకే పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికవ్వడంపై ఎంఈవో కురమాన అప్పారావు, సర్పంచ్ ఇసురు తులసీరాం, ఎంపీటీసీ మరడ వలసయ్య తదితరులు అభినందనలు తెలిపారు.